
# నడిచే పద్యం

# నండూరి



సంకలనం :

దైవజ్ఞ శిరోమణి నండూరి గోవిందరాజు

## డా॥ నండూరి రామకృష్ణమాచార్య,

## పరిచయ రేఖలు

తల్లి : శ్రీమతి వెంకటమ్మ

తండ్రి : శ్రీమాన్ శోభనాద్రాచార్యులు

జీవితకాలం : 29-04-1921, నుండి 06-07-2003 వరకు

ఉద్యోగం : ఆంధ్రభాష శాఖాధ్యక్షులు భీమవరం, అనంతపురం, చిత్తూరు డిగ్రీ కళాశాలలు; ప్రధానాచార్యులు తాడేపల్లి గూడెం, విశాఖపట్నం, కాకినాడ డిగ్రీ కళాశాలలు ; హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కరికులమ్ & టెక్స్‌ట్ బుక్స్ ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

పదవులు : యు.జి.సి. ఎమెరిటియస్ ప్రొఫెసర్, ఆంధ్ర ఉస్మానియా విశ్వవిద్యాలయాలు; ఎడిటర్ క్లాసికల్ పబ్లికేషన్స్; టి.టి.డి, స్పెషల్ ఆఫీసర్ ధర్మ ప్రచార పరిషత్, టి.టి.టి; చైర్మన్ : ఆం.ప్ర. అధికారభాషా సంఘం; సభ్యులు సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు;

నండూరి వారిపై రిశోధనలు చేసినవారు :

డా॥ మునిరత్నం పిళ్లె – శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం

డా॥ వింజమూరి లక్ష్మి – ఆంధ్ర విశ్వవిద్యాలయం

డా॥ వెంకటయ్య & శ్రీమతి నాగలక్ష్మి – ఉస్మానియా విశ్వవిద్యాయం

నండూరివారు అంకితంగొన్న గ్రంథాలు :

1. ఓవరి (పద్యం) శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్య, పశ్చిమ గోదావరి
2. మెరుపు తీగలు (పద్యం) డా॥ ఆశావాది ప్రకాశరావు, అనంతపురం
3. ఋతు సంహిత (విమర్శ) డా॥ నందుల గోపాలకృష్ణమూర్తి, పశ్చిమ గోదావరి
4. హృదయ స్పందన (పద్యం) డా॥ మలయశ్రీ, కరీంనగర్
5. స్నేహసుధ (పద్యం) శ్రీ నరహరి రాజు, మహబూబ్‌నగర్
6. కలుపు మొక్కలు (పద్యం) శ్రీ నల్లాన్ చక్రవర్తుల శేషాచార్యులు, హైదరాబాద్
7. కృష్ణశాస్త్రి కవిత్వం (విమర్శ) డా॥ బి.భాస్కరచౌదరి & డా॥ జి.చెన్నయ్య, చిత్తూరు.
8. రాగ హృదయం (పద్యం) ఉషశ్రీ & కె.వీరభద్రాచారి, పశ్చిమ గోదావరి.
9. నన్నెచోడుని కుమార సంభవం (విమర్శ) ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి, విశాఖపట్నం.
10. పద్య ప్రసూనాలు (పద్యం) – ఆచార్య ఫణీంద్ర
11. రసఋక్కులు (పద్యం) – డా॥డి.వి.ఆర్.కె.ప్రసాదు

# నడిచే పద్యం నందూరి

మా దేశికస్వామి

**డా॥ నందూరి రామకృష్ణమాచార్యుల సంస్మరణార్థం**

విద్యార్థుల పద్యపఠనం పోటీలకు

శ్రీవారి గ్రంథాలనుండి ఏర్చికూర్చిన పద్యసుమాలు


సంకలనం & ప్రచురణ

**నందూరి గోవిందరాజు**

రిటైర్డ్ వైస్ ప్రెసిడెంట్, సైంట్ లిమిటెడ్,

8-1-284/ఒ.యు./715, ఒ.యు. కాలనీ,

హైదరాబాద్ - 500008

సెల్ నెం : 9440495887, 9866115177

ఇమెయిల్ : ngraju1950@gmail.com

## పీఠికాప్రబంధ పరమేశ్వరుడు,
## అధ్యతనాంధ్ర పద్యకవితా పితామహుడు
## డా॥ నందూరి వారిపై వెలువడిన ప్రత్యేక సంచికలు

1. విహంగవీక్షణము - **2000** :- తెనుగు భారత సాహిత్య పరిషత్, ఉయ్యూరు, కృష్ణాజిల్లా.
2. డా॥ నందూరి సాహితీ సన్మాన సంచిక - **23** ఏప్రిల్ **2000** సాహితీ గౌతమి, కరీంనగర్,
3. అశీతి సంచికా విపంచిక - **2001 : 2002** :- సాహితీ సంక్రాంతి, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.
4. సాహితీ కౌముది - **2004** జూలై - ఆంధ్రపద్య కవతాసదస్సు త్రైమాస పత్రిక,యలమంచిలి.
5. చైతన్య కవిత - **1996** అక్టోబరు - త్రైమాసిక పత్రిక, బెంగుళూరు

## డా॥ నందూరి వారికి లభించిన పురస్కారాలు

1. తెలుగు భాషా సమితి - బహుమతి 'కవిత్రయము' గ్రంథమునకు
2. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - పద్య కవితా పురస్కారం - 'ఆలోచనము' గ్రంథమునకు.
3. దాశరథి స్మారక పురస్కారం
4. మధునా పంతుల స్మారక పురస్కారం
5. కరుణ శ్రీ స్మారక పురస్కారం

This booklet is published by Daivagna Siromani **N.G.Raju**, Astrologer. Copies can be obtained from N.G.Raju, Plot No.423, Raja Rajeswari Nagar, Kondapur, Hyderabad.
**Cell : 9440495887, e-mail : ngraju1950@gmail.com**

# ప్రదీపనం

తెలుగు సాహితీ క్షేత్రంలో కల్పవృక్షం వంటివారు డా॥ నందూరి రామకృష్ణమాచార్యుల వారు. ఆయన గాంధేయవాది. సనాతనసంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఆధునికతను కూడా ఆహ్వానించారు. నిరంతర చైతన్యశీలిగా, అభ్యుదయ భావాల ప్రోదిగా సమకాలిక సాహితీ మేరువుల అందరిచేత గుర్తింపబడి ప్రశంసలందుకున్నారు. తన మహోన్నత వ్యక్తిత్వంతో రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా తనంతటి వారు కాగలిన ఎందరో శిష్యుల్ని తీర్చిదిద్దారు.

పద్యాన్ని ప్రశంసనీయంగా వ్రాసే ఆధునిక కవుల్లో డా. నందూరివారు సుప్రసిద్ధులు. తనదైన ముద్రగల సజీవాలైన ఆటవెలది పద్యాలను అసంఖ్యాకంగా రచించి 'అభినవ వేమన'గా ఎందరికో భవ్యకవితావేశం కలిగించి 'ఆంధ్ర పద్య కవితా పితామహులు'గా ఘనంగా సత్కరింపబడినారు. డా. నందూరివారు సాహితీ సహవ్రతుల గ్రంథాలకు వ్రాసిన పీఠికలు సరిక్రొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. బహుభాషా కోవిదులు ప్రథమ తెలుగు ప్రధాని శ్రీ పి. వి. నరసింహారావుగారు, రామకృష్ణామిషన్ అధినేత శ్రీ స్వామిరంగనాధానందలచే అభినుతింపబడిన ఆంగ్లంలో మహాభారత రచన చేశారు. ముత్యాల గొడుగు పద్యకావ మున్నుడిలో డా. నందూరి వారు తన అర్థ శతాబ్ది సాహితీ ప్రస్థానమును వివరిస్తూ, తన అబ్బాయి శ్రీ నందూరి గోవిందరాజు ఆహ్వానంపై జబల్‌పూరు వెళ్ళి ఆంగ్లంలో మహాభారతం – సంస్కృత మూలం అనుసరించి వ్రాశానని తెలిపారు. ఏ రోజు వ్రాసిన ప్రతిని ఆరోజే చదివి, టైపు చేయించి, తప్పులు సరిదిద్దే అవకాశం, మూడవ కుమారుడనైన నాకు లభించింది. ఇది ఆ సమయంలో కలిగిన అదృష్ట విశేషము – నాకు దక్కిన ఉడుతాభక్తి సేవ.

డా. నందూరి వారు వ్రాసిన 'ఆలోచనము' పద్య గ్రంథానికి 2003లో తెలుగు విశ్వవిద్యాలయం వారి పద్యకవితా పురస్కారం లభించింది.

అర్థ శతాబ్ది పైబడి డా. నందూరి వారు చేసిన సాహితీ తపస్సు మెచ్చి, ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు, 1987–90 సంవత్సరములకు అధికార భాషా కమీషన్ అధ్యక్షునిగా పదవి ఇచ్చి సత్కరించారు.

తెలుగు పద్యరచన – నిలుచు – కంఠస్థమై
అతికిపోయి మనసు అరలలోన ;
మనుజగాత్ర ధర్మమర్మ చైతన్యమ్ము
చిందులాడు తెలుగు చంధమందు

తెలుగు వారికి – సహస్ర సంవత్సరాల పద్య సాహితీ వారసత్వం ఉంది. ఈ వారసత్వాన్ని కాపాడుకొని పెంపొందించుకోవడం తెలుగు వారి పవిత్ర కర్తవ్యం. అని తను రచించిన పద్యశిల్పం అనే కావ్య మున్నుడిలో ప్రస్తావించారు – నమ్మినారు – తన జీవితం పద్య కవితలకే ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చారు.

మా నాన్నగారు, వారి మరణానంతరం ధనాన్ని తద్దినాలకై వెచ్చించుటకన్నా తెలుగు కవితా వ్యాప్తికి – పద్యపఠన పోటీలకు, సాహిత్య సభలు నిర్వహించుటకు బీదవారికి విద్యాభ్యాస

వసతి కల్పించుటకు వెచ్చించాలని పలుసార్లు చెప్పారు. తదనుగుణంగా, నా అగ్రజ సోదరుడు నండూరి శోభనాద్రి గారు మా జనకులు అందించిన సహస్రాధిక పద్య పుష్పాలలో 150 దాకా పద్యాలను ఏరి 'నడిచే పద్యం నండూరి' అనే సంపుటిని ప్రచురించారు. ఈ సంపుటిని మా సోదర నిర్విశేషుడు డా.ఆశావాది ప్రకాశరావు గారు సంకలనం చేయుట ముదావహం. చిరు మార్పులు కూర్పులతో, ఈ పద్య పుస్తకమును మరల మీకందించుచున్నాను. ఈ పుస్తక ప్రతులను కావలసినవారు ఉచితంగా నావద్దనుంచి పొందగలరు. ఈ పుస్తక ప్రచురణ విషయంలో ఏవైనా సూచనలు, సలహాలు ఉంటే తెలుపవలెనని మనవి.

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం సంస్థ అధ్యక్షులు శ్రీ కళ్ళేపు సాగర రావు, కార్యదర్శి డా.ఆచార్య ఫణీంద్ర మరియు కోశాధికారి శ్రీ ఆత్మకూరి గాంధీ గార్ల సహకారంతో మా కుటుంబసభ్యులు గత 15 సంవత్సరాలుగా డా.నండూరి వారి జయంత్యుత్సవాలను నిర్వహించి, ఫీఠం తరపున డా.నండూరి వారి స్మారక పురస్కారాన్ని అందజేయగలిగాము. మహాకవి కాళిదాసుని యుగంపై డా.నండూరి వారు పరిశోధన చేశారు. తన పరిశోధన గ్రంథాన్ని 2006లో సాహిత్య పీఠం వెలువరించింది. డా.నండూరి వారి 'శీర్ణమేఖల', 'అజ్ఞాత కాంతేయం'లను – 'కవితా కర్ణామృతం' పేరిట – మధురగాయక మౌళి శ్రీ అమలాపురం కన్నారావు గారి సంగీత గానంలతో డా.ఆచార్య ఫణీంద్ర గారి వ్యాఖ్యానంతో 2010లో పీఠం వెలువరించింది. డా.నండూరి వారి జ్యోత్స్నాభిసారిక నృత్య నాటికను శ్రీ ఉదయ్ ముద్గల్ సంగీత అధ్వర్యంలో శ్రీ సాందీప్, లలితా సాగరి, హరిప్రియ గానం కూర్పుతో సి.డి.లను 2012లో వెలువరించాము. ఈ పద్య కావ్యం ఖండికలు మరియు నృత్య నాటిక సి.డి.లు ప్రజలు ఆస్వాదించి ఆనందిస్తారని తలుస్తున్నాను.

పైన ఉదహరించిన 'కాళిదాసు అండ్ టైమ్స్' గ్రంథము, 'కవితా కర్ణామృతము' మరియు 'జ్యోత్స్నాభిసారిక' సాహిత్య గానములను 'సి.డి. రూపములో వెలువరించుటకు శ్రీమతి & శ్రీ కళ్ళేపు సాగరరావుగారు, శ్రీమతి పుష్పలత & జశ్వంత్ రావు దంపతులు, శ్రీ కళ్ళేపు రామారావు గార్లు పూర్తిగా ఖర్చులు భరించుట గొప్ప విశేషం.

మా కుటుంబ సభ్యుల కోరిక మేర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తమ ఆధ్వర్యంలో నండూరి రామ కృష్ణమాచార్య కీర్తి పురస్కారం – పద్య రచనలకై ప్రతి సంవత్సరము ఇచ్చుటకై అంగీకరించి, ప్రధానం చేస్తున్నారు వారికి ధన్యవాదములు.

నమస్సులతో

నండూరి గోవిందరాజు

డా.నండూరి వారి మూడవకుమారుడు

హైదరాబాదు

07/11/2018

# నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం ప్రస్థానం

మహాకవి కీ.శే. డా.నండూరి రామకృష్ణమాచార్య జయంత్యుత్సవాలను ప్రతియేటా ఘనంగా నిర్వహించడంతోబాటు, వారి సాహిత్య వైభవాన్ని భావి తరాలకు అందించే సదాశయంతో ఏర్పడ్డ మా 'నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం', ఆ పద్ధతిలో 2003 నుండి కృషి చేస్తున్న విషయం సర్వజన విదితమే. 2003లో నండూరి వారి సాహిత్యానుశీలన సదస్సును నిర్వహించాం. అనేక సంవత్సరాలుగా విద్యార్థులలో నండూరి వారి పద్యాల పట్ల ఆసక్తిని కలిగేందుకు గాను పద్యపఠన పోటీలను నిర్వహించాము. అందుకు ఉపయుక్తంగా ఉండే విధంగా ప్రముఖ అవధాని డా.ఆశావాది ప్రకాశరావుగారి కూర్పుతో కీ.శే. నండూరి శోభనాద్రిగారు 'నడిచే పద్యం నండూరి' అన్న చిన్న పుస్తకాన్ని ముద్రించడం జరిగింది. ఇప్పుడు ఆ పుస్తకాన్ని కొన్ని మార్పులతో శ్రీ నండూరి గోవింద రాజు గారు పునర్ముద్రించడం ముదావహం. వారికి మా సంస్థ పక్షాన ధన్య వాదాలను తెలియజేసుకొంటున్నాం.

అంతే కాకుండా ప్రతి సంవత్సరం పద్యకవిత్వ సంబంధంగా విశేష కృషి చేసిన లబ్ద ప్రతిష్ట సాహితీ మూర్తులకు నండూరి వారి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తూ ఉన్నాం. ఆ వరుసలో సన్మానితులైన ప్రముఖుల వివరాలు..

2004 : డా॥ఆశావాది ప్రకాశరావు, ప్రముఖ కవి, అవధాని

2005 : శ్రీ శిష్టా వెంకటరావు, పద్యవిద్యాప్రచారకులు

2006 : డా॥రాపాక ఏకాంబరాచార్య, అవధాన విద్యా పరిశోధకులు

2007 : డా॥మల్లెమాల, ప్రముఖ కవి, సినీ నిర్మాత

2008 : ఆచార్య వి.ఎల్.ఎస్.భీమ శంకరం, ప్రముఖ కవి, భూ భౌతిక శాస్త్రవేత్త

2009 : శ్రీ ముదివర్తి కొండమాచార్యులు, ప్రముఖ కవి

2010 : శ్రీ నల్లాన్ చక్రవర్తుల శేషాచార్యులు, ప్రముఖ కవి

2011 : డా.తిరుమల శ్రీనివాసాచార్య, ప్రముఖ కవి

2012 : శ్రీదుగ్గిరాల రామారావు, ప్రముఖ కవి

2013 : డా.మేడసాని మోహన్, ప్రముఖ అవధాని

2014 : ఆచార్య. కోవెల సుప్రసన్నాచార్య, ప్రముఖ కవి, విశ్వవిద్యాలయాచార్యులు

2015 : డా.జె.బాపురెడ్డి, ప్రముఖ కవి, ఐ.ఎ.ఎస్. అధికారి

2016 : శ్రీమతి చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ, ప్రముఖ కవయిత్రి

2017 : డా.డి.రంగారావు, ప్రముఖ ఆంగ్ల రచయిత, అనువాదకులు

2018 : ఆచార్య ఎస్.వి.రామారావు, ప్రముఖ సాహితీ విమర్శకులు, ఎక్స్‌డీన్ ఆఫ్ ఆర్ట్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

మా ఈ ప్రస్థానంలో మాకు విశేష సహకారాన్ని అందిస్తూ మార్గదర్శనం చేస్తున్న వారు మా సంస్థ అధ్యక్షులు శ్రీ కళ్ళేపు సాగరరావు. అట్లాగే మా కార్యక్రమాల నిర్వహణలో డా॥ నండూరి వారి కుటుంబ సభ్యులంతా.. ముఖ్యంగా శ్రీ ఆత్మకూరి గాంధీ, కీ.శే.శ్రీ శోభనాద్రి (2013 వరకు), శ్రీ గోవిందరాజు, డా.విద్యారణ్యస్వామి గార్లు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం అసామాన్యం. వారందరికి మా సంస్థ పక్షాన ప్రణామాలను సమర్పించుకొంటున్నాం. మా గురువుగారు నండూరి వారి జయంత్యుత్సవాల నిర్వహణలో మాకు సహకరిస్తున్న నవ్యసాహితీ సమితి అధ్యక్షులు శ్రీ వేమరాజు విజయకుమార్ గారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని చదివి ఆనందించి పది మందికి అందించి, నండూరి రామకృష్ణమాచార్యుల వారి సాహిత్య ప్రచారంలో పునీతం కావలసిందిగా ప్రార్థన.

డా.ఆచార్య ఫణీంద్ర

ప్రధాన కార్యదర్శి

## పన్నీటి జల్లు

అప్పుచేసి అతడు గొప్పగా వెలుగొందె
రాజువోలె చివరిరోజు వరకు !
అసలు చెడినదెవరు ? అప్పులిచ్చినవారె !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

అస్తమించు సూర్యు డడిగె దర్పమ్ముతో
ఎవ్వరింక వెలుగు నిచ్చెదరని !
ఓపినంతవరకు ఉన్నాననె ప్రమిద !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

ఇల్లు వదలనేల ? ఇల్లాలి విడనేల ?
గడ్డమేల ? కావి గుడ్డలేల ?
మంచిపౌరుడౌచు మనుజుండు మసలుచో !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

ఈదిచేరినాను గోదావరిని దేలు
పసిడిపడవ యనుచు పదవి గాంచి !
పట్టుకొనెను పదవి భల్లూకమై నన్ను !
రమ్యహాసలోల! రామకృష్ణ !

తెలిసికొనిన దెవడు ? దేవుని నిజముగా
లేడు – చూచినట్టి వా డొకండు !
వాడుకొననివాడు లేడయా భగవంతు !
రమ్య హాసలోల ? రామకృష్ణ !

ఓట్లు కొనెడివాడు ఊరకే ఇచ్చునా ?
దాచిపెట్టినట్టి ధనము తెచ్చి –
అమ్మివేయగలడు అతడు దేశమ్మునే !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

పెద్ద ప్రహసనమ్ము పృథ్విలోపల ఏది ?
చదువు రాని శుంఠ – పదవి వచ్చి ;
గద్దెనెక్కి సభల గర్జించుచుండుటే !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

దీనసేవ చేయు దేశభక్తుడొకండు
బక్కచిక్కు పేదవాని గాంచి
ఎన్నికలకు ముందు ఎక్కెక్కి ఏడ్చురా !
రమ్మ హాసలోల ! రామకృష్ణ !

ఆడుదాని కంటె – అధికారమున కంటె
ఎదకు పట్ట నట్టి – చదువు కంటె !
మద్యపానమందు మత్తేమి లేదయా !
రమ్య హాసలోల ! రామ కృష్ణ !

మనుజులెల్ల రక్తమాంసాల ముద్దలే –
అంతరాత్మ భేద మరయవలయు –
వెదురు ముక్క చూడు వేణువు చూడరా !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

మరణమొందినపుడు మాతృదేవిని గూడ
తగుల బెట్టకుండ తప్పునయ్య ?
ప్రాతదనము క్రుళ్ల పాతిపెట్టుము వేగ !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

అతడు సన్యసించి ఆలు బిడ్డల వీడె !
ధనము వీడె ! శిష్యజనము వీడె !
మతము వీడలేక – మ్రగ్గె స్వాములవారు !
రమ్యహాసలోల ! రామ కృష్ణ !

రాళ్లు రువ్వినారు రాజకీయునిపైన
వేలకొలది ప్రజలు వెక్కిరించి
ఆత డిల్లు కట్టె ఆ రాళ్లనే పేర్చి !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

వధువు పెండ్లి ముందు పసిడి సిగ్గులమొగ్గ !
వెంటనంటు నీడ పెండ్లినాడు !
పెండ్లియైన మీద పెనుభూతమౌనురా !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

వరుడు పెండ్లి ముందు పసిడి పనసపండు !
పెండ్లినాడు ముదురు బెండకాయ !
పెండ్లియైన పిదప పెద్దపాలేరురా !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

వరుడు కోరి తెచ్చె పదివేలు కట్నమ్ము
భార్యవెంట దెచ్చె పాత కారు !
కట్నమెల్ల పట్టె కారు 'రిపేరి'కే !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

పెద్దమనిషి యొక్క – పేద గాడిద మోసె
కనుల ముందు వ్రేలు – గడ్డి కొరకు
నోటి చొంగ కారె – నూరామడల మేర !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

ఏల కోరుకొనుట – ఈ ప్రజాస్వామ్యమ్ము ?
దొసగు లిన్ని యున్న దొరతనమ్ము ?
ఇంతకంటె చెడ్డ వితర రాజ్యాంగముల్ !
రమ్య హాసలోల ! రామ కృష్ణ !

సంస్కరింపనేల సంఘమంతయు నీవు ?
సజ్జనుండవగుము స్వార్థముడిగి !
ఒక్క నీచు డపుడు ఉర్విలోపల తగ్గు !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

లోకమెల్ల – చిమ్మ చీకటుల్ గ్రమ్మగా
వగవ వద్దు – ఒరుల తెగడ వద్దు !
వెదకి – ప్రమిద – నొకటి వెలిగింపరా ! చాలు !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

తిరుగుబాటు దారు దేశ నాయకుడౌను
వేలకొలది చంపి విప్లవమున !
ఒకని చంపువాని కురిశిక్ష పడవచ్చు !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

మైత్రిగాని – మరియు – శత్రుత్వమే గాని
చెడ్డ వానితోడ చేయరాదు !
శాత్రవమ్ము హాని – మైత్రి మంచిది గాదు !
రమ్య హాసలోల – రామకృష్ణ !

ఎంతమంది చెమట ! ఎందరి నెత్తురుల్ !
పిండకుండ ఎవడు పేర్చె ధనము ?
దొరలు చేయునట్టి దోపిడియే ఆస్తి !
రమ్య హాసలోల ! రామకృష్ణ !

మూఢ మానవుండు ముక్కోటి దేవుళ్ళ
సృష్టిచేసె కన్ను చెదరిపోవ
సృష్టి చేయలేడు చిన్న చీమనుగూడ !
రమ్యహాసలోల ! రామకృష్ణ !

పుడమి పుట్టువులకు – పుత్రేషణము మెండు !
మనుమలన్నగూడ మమత యుండు !
బ్రతుకు తీర్చిదిద్దు రక్తానుబంధమ్ము !
హేతువాది ఎవడు పృథివిలోన ?

అన్ని రోగములకు ఔషధములు వచ్చె –
సగటు వయసు పెరిగె జగతియందు !
జబ్బుచేసి యింక చావనక్కరలేదు
మందు వలన తప్ప మనుజులెవరు !

ప్రజల ప్రోగు చేసి – పనిచేయు ప్రజ్ఞయే !
గొప్ప యజ్ఞమనుచు చెప్పదగును !
కర్మయోగి యైన – కార్యశూరుడొకండె !
కలలు కనెడి కవుల కంటె – ఘనుడు !

చిట్టి ఎలుక సాటి – సింహమ్ము కాదయా
వలను కొరికి వేయ వలసి నపుడు !
ప్రకృతియందు – ప్రజ్ఞ – పలు రీతులై తోచు !
హెచ్చు తగ్గులెల్ల – పిచ్చి భ్రమలు !!

అహము కొంతలేక, ఆత్మవంచన లేక
గొప్ప యెంత ఉన్న గురువు కాడు
శిష్యుడగుట సులువు జిజ్ఞాసయున్నచో !
చేయవలయు గురువు శిష్యపూజ !!

కలవు – వివిధ ధర్మములు జీవితమ్ములో !
స్వీయ హితము మరియు విశ్వ హితము !!
విడువ – చిన్న పరిధి – పెద్ద వృత్తమునకై
పరమ ధర్మమగును – బ్రదుకు నందు.

చర్యలందు – సంఘ సంస్కార హృదయమ్ము!
నరుడు చూపు గాక కరుణ కలిగి
చేతలందు లేని నీతి పాఠములేల ?
కోత లేల ? కారు కూత లేల ?

వదలవద్దు ఇల్లు – వద్దు సన్యాసమ్ము
సగటు మనిషి వోలె జగతి బ్రదుకు !
గ్రుడ్డి నమ్మకాల – గుండె దాచగ రాదు !
గురువు లెవరు వద్దు – గుడులు వద్దు !!

ఆత్మనిష్ఠమైన అవహేళనముకంటె
జీవ చిహ్నమేది సృష్టియందు ?
అన్ని రోగములకు అమృతౌషధము నవ్వు !
అంతరంగమునకు ఆటవిడుపు !!

లోకమందు ఏమి లేక పోయిన గాని,
శీలమున్న యెడల – చాలు చాలు !
జీవితమ్ము నందు – శీలమ్ము లేనిచో
ఏమి లాభ మగును – ఎన్ని యున్న ?

ఆయుధాలు కావు – అణ్వస్త్రములు కావు –
భరతమాత కేది ప్రాణరక్ష ?
చమురు గనులు కావు హిమవన్నగము కావు –
స్వేచ్ఛ కోరు ప్రజల జీవశక్తి !

ఆవహించెనేని అధికార భూతమ్ము
మనిషి మెదడు, ఎడద మార్చివేయు !
పదవి యెదుగు కొలది హృదయమ్ము క్షీణించి
మానవుండు మారు దానవుడుగ !

మళ్ళు కొద్ది వయసు – మరణమ్ము దరి యౌను
పెరిగి పోవు పనులు – తరుగు వ్యవధి !
వ్యయము చేయరాదు వార్ధక్య దశలోన
సమయ మెపుడు ఒక్క క్షణముగాని !

మాయలేడి వేట – మనిషి సల్పును గదా
తెలియకుండ తరచు దిన దినమ్ము !
రామ చరిత చూడ – రామాయణము నందు
ప్రతిఫలించు నరుల బ్రతుకు సరళి !!

ఎల్ల సృష్టి – మన అభీష్టానుసారమే
ఉండవలయు ననుట – ఉట్టి వెట్టి !
జగతి – పొంగు నిత్య చైతన్య విస్ఫూర్తి !
సర్దుకొనుట మేలు సరసు డెపుడు !!

ఉజ్వలోజ్వలమగు ఊహగానము గాక
నాకలోకమేది ? నరకమేది ?
చేయగలడు విశ్వసృష్టికే ప్రతిసృష్టి
కష్టపడెడి పూజ్య కార్మికుండు !

ఉండవచ్చు మెదడు – ఉండవచ్చును ఆస్తి –
చదువు గలిగి మేటి పదవి గలిగి
ప్రతిభలెన్ని యున్న బ్రతుకు ధన్యము కాదు !
ఉండ వలెను జాలిగుండె కొంత !!

ఉర్వి మీద ఏల ఉద్భవించితి నేను ?
నేల మనిషి బ్రదుకు – నీటి బుడగ !
ఎపుడు చేయ రాదు – ఎవరికైనను హాని,
చేతనైన మేలు చేయదగును !

ఎగురు మానవుండు గగనాన విహగమై
గండుచేప రీతి కడలి నీదు
పుడమి మనిషి వోలె నడవలేడేలొకో!
ఇంతకంటె వేరు వింతకలదె ?

ఏను తరచు మార్చినాను ఉద్యోగముల్,
ఊళ్లు, ఇళ్లు, కార్లు, కళ్లజోళ్లు !
మార్చినాడనన్ని మా శ్రీమతిని తప్ప !
మధుర కవితమీద మమత తప్ప !

ఎద్దు పుండు కాకి కెట్టి నొప్పిని గూర్చు
పడక తప్ప దెవరి బాధ వారు !
సానుభూతి కొరకు సాయమ్ముకోసమై
వెదుకువాడు వెట్టివెంగళప్ప !

ఎవడు విసిరె చూడ అవివేకి ఒకరాయి
కడలి నీటిలోన కలిసి పోవ ?
వేయిమంది గొప్ప విద్వాంసులును చేరి
వెలికి తీయగలరె – వెదికి దాని ?

ఏన్గు నెక్కినపుడు ఎత్తుగా కన్పించు
పొట్టివాడు కూడ పుడమినుండి !
తెలివిలేని జడుడు తేజస్విగా తోచు
పెద్దపదవి యన్న గద్దెమీద !!

ఒకని చంపువాని కురిశిక్ష పడవచ్చు–
వేలకొలది చంప వీరుడగును !
సిగ్గు ఎగ్గు లేక సింహాసనంబెక్కి
హింస విశ్వమెల్ల ఏలుచుండె !!

ఒకటి మంచుపైన, ఒకటి నిప్పుల మీద
పెట్టి కాళ్లు నిలువ పెద్దమనిషి
సగటు లెక్కకట్టి సమశీతలమని ప్రేలు
అంక గణిత ఫణితి అంచనాలు !

కదము త్రొక్కునట్లు పదివేల గుఱ్ఱాలు
నడుపవచ్చు ఒక్క నాయకుండు !
వంద కప్పలైన పది కోతులైనచో
నిర్వహింపలేడు నేత యెవడు !

కవులకంటె తుహిన కర్పూర నిభకీర్తి
తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి ?
సాహితీ తరంగ సంగీత రసధుని !
దేశభాషలందు తెలుగు లెస్స !!

కవితకు అసాధ్యమైన అర్థ విలసనము
వీణకు అగమ్యమౌ నాదబిందులయలు
మానసమునకందని భావమధురిమములు
అనుభవింతును నీ మౌనమందు దేవ !

కవన పఠనమునకు గానమాధురి శోభ !
జ్ఞానమునకు శోభ మౌన నిష్ఠ !
విజయమునకు శోభ వినయ విన్యాసమ్ము !
శీలమునకు శోభ చిత్తశుద్ధి !!

కాగి కాగి పాలు గడ్డమీగడ కట్టు –
పిదప మారిపోయి పెరుగు అగును !
చదివి చదివి పడయు జ్ఞానంబు విద్యార్థి !
గురువు 'తోడు చుక్క' పెరుగునందు !!

కాలము మారిపోయినది – కంచరగాడిద చక్రవర్తి గు
ఱ్ఱాలకు సార్వభౌముడయి రాజ్యము చేయుచునున్నవాడు – దీ
పాలను ఆర్పుచున్న వెదవాయియె బల్మొనగాడు నేడు – మా
ర్జాలము వ్యాఘ్రరాజు – ఒకజాతికి చేరెను దండుకేశ్వరా !

కాల చక్రమెవడు గడియారమును బోలె
తిరిగి వెనుక దెసకు త్రిప్పగలడు !
మేలు చేసియున్న మేటి ఆచారముల్
గడువు ముగిసియున్న విడువవలయు !!

క్షామము దాపురించి పలుసారులు చచ్చెను జంతు సంతతుల్ !
వేమరు చచ్చినారు ప్రజ వెనకువేలు చరిత్రలోపలన్ !
క్షామము లెన్ని వచ్చిన రసజ్ఞత ఇందుక చావలేదు –  జ్ఞా
నామృత వృష్టికిన్ కొరతనందని రాయలసీమలోపలన్ !

కుమిలి క్రుళ్లుచు నిరుపేద గుడిసెలెల్ల !
కంపు కొట్టుచు నుండుట కల్లగాదు !
అద్యతన నాగరిక హృదయాల కంటె
ఎంత పరిశుభ్ర మైనవో ఎంచి చూడు !

కొంతమంది నవ్వు గుఱ్ఱాల సకిలింపు –
పంది అరుపు కొంతమంది నవ్వు
ఏడ్చినట్టులుండు ఈర్ష్యాళువుల నవ్వు !
వెక్కి వెక్కి నవ్వు వెకిలివాడు !

క్రొత్తదనమును కనలేక కుమిలి, క్రుంగి,
ప్రసవ వేదన పడుచుండు పాతదనము !
విశ్వ విప్లవ ప్రస్థాన వేది నుండి
ఉద్భవించుత నూత్న యుగోదయమ్ము !

కోరుకొనను ధనము – కోర నే స్వర్గమ్ము !
లేదు నాకు పదవి మీద కాంక్ష !
యోగ్యులైనవారి కుపకార మొనరించి
గుప్తదాన మిచ్చు కోర్కికలదు !

కోరుకొనిన కోరిక సీతకోక చిలుక –
పట్టుకొనబోయి వెనువెంట ప్రాకులాడ
చేతికందదు గాని – నిశ్చింతతోడ
వదలి కూర్చున్నచో మీద వ్రాలవచ్చు !

గంగ కూడ నేడు కాలుష్యమయమయ్యె !
నేల, నింగి, మంచిగాలి లేదు !
బ్రదుకు తీర్చిదిద్ద పర్యావరణ శుద్ధి
ధ్యేయమగుత ప్రజకు ఇంక మీద !

గడ్డిపోచ చాలు గాలివాటము దెల్ప !
చాలు ఒక నమస్సు చాట భక్తి !
మంచితనము తెలుపు మాట ఒక్కటె చాలు !
పూజచేయ గడ్డిపూలు చాలు !!

గూడుకట్టుకొనిన గొంగళి పురుగులై
చేయగలరు కవులు చిర తపస్సు !
చివర సీతకోక చిలుకలై సొగసుగా
గగన వీధులందు ఎగురగలరు !!

గొప్పశిష్యుడొకడు కుదురుకొన్నను చాలు
వంద స్నేహితులకు వాడు సమము !
బ్రతుకు పోరులోన రక్షైక కవచమ్ము,
చేత దాగు కత్తి శిష్యవరుడు !

గోదావరికి కల్కి కుల్కుల నాట్య వి
న్యాసములను నేర్పె నన్నయ కవి
గరువంపు మురువు వాల్గనుల అంచుల నింప
తెలుగువాణికి నేర్పె తిక్కన కవి
మందార మకరంద మాధుర్యములు తెల్గు
పొలముల పండించె పోతన కవి
స్వర్గలోకమునుండి పారిజాతము దింపి
తెలుగు సాహితి నాటె తిమ్మన కవి

మువ్వ గోపాలు చిన్నారి మురళి తోడ
తాండవింపగజేసె క్షేత్రయ్య గీతి !
తెలుగు హృదయాల తంబురా తీగె మీటి
అమృత రసతరంగిణి చేసె త్యాగరాజు !

చదువు వేరు – హృదయసంస్కార మది వేరు,
దాన గుణము వేరు – ధనము వేరు –
సాహసమ్ము వేరు – శౌర్య సంపద వేరు –
ఉన్న యెడల కలిసి ఉజ్జ్వలమ్ము !

చాల దూర ముండు జాగ్రత్త జాగ్రత్త !!
దేవళమ్ములకును – దేవునకును –
గుడుల కట్టుబాట్ల సుడిగుండమున చిక్కి
చెందలేడు 'ముక్తి' జీవుడెపుడు !

చెక్కవచ్చు సొగసు శిల్పవరేణ్యుండు
పాలరాతిపైన, పసిడిపైన !
మనిషి మెదడు మీద మన ఉపాధ్యాయుండు
విలువ కట్టలేని విద్య చెక్కు !

చెట్టు మీద కాక, చిత్తవృత్తులలోన
పూచినట్టి పూల పూజలేక –
దివ్య మంత్ర పుష్ప దీపధూపాలతో
తృప్తి చెందబోడు దేవుడెపుడు !

చెరిపివేయు మన్ని సరిహద్దుగీతలు
పుడమిలోన మనిషి యెదదలోన –
అసలు పెద్దమనిషి వసుధైకపౌరుండు !
మంచితనమె పెద్ద మనిషి గుర్తు !!

జగతియెల్ల మధుర సౌందర్యమయమంచు
కనులు మూసి కలలు కాంచినాను –
కనులు విప్ప తెలిసె కర్తవ్యములు చేయ
వాసయోగ్యమగును వసుధయనుచు !

జీవకోటికెల్ల యావజ్జగత్తులో
జనని ప్రథమ పాఠశాల సుమ్ము !
వేగ బాగుపడును విద్యా విధానమ్ము
మొదట ఆడపిల్ల చదువు చూడ !

తరిపి వెన్నెల ఆణిముత్యాల జిలుగు,
పునుగు జవ్వాజి ఆమణి పూల వలపు
మురళి రవళులు, కస్తూరి పరిమళములు,
కలిసి ఏర్పడె సుమ్ము మా తెలుగు భాష !

దేనివలన దెబ్బతిను ప్రజా స్వామ్యమ్ము ?
స్వార్థపరుల పనుల వలన కాదు !
కనులముందు జరుగు క్రౌర్యమ్ము తిలకించి
ఊరుకొనెడి మంచివారి వలన !!

సులువు బలువు లెరిగి – సూక్ష్మ దృష్టిని గల్గి
పనుల చేయ వలెను – బ్రదుకు నందు !
పొలము దున్న దగును – తొలకరించెడు నాడు !
విత్తు నాట వలెను – వేళ నెరిగి !

నేటి నేత మోజు ఓటుపై మాత్రమే –
రేపు మీద అతని చూపు పడదు !
బ్రతుకు తెరువు జూచు రాజకీయము వేరు !
ప్రగతికోరు దేశభక్తి వేరు !!

పదమునకు గల అర్థమ్ము పరిమితమ్ము
వివిధ భాషలు విలసిల్లు విశ్వమందు !
గుండె మాటాడు, వేరొక గుండె తోడ –
గానమెల్ల మానవుల కేకైక భాష !

పచ్చి ద్రాక్ష పులుపు పరిపక్వమై పండి
మారిపోవు మధుర మధురమవుచు !
చిన్ననాడు ఎంత చెడ్డవాడుగనున్న –
మనిషి యోగియౌచు మారవచ్చు !

పాఠశాల లేక ప్రథమ వైద్యము లేక
బస్సు లేక, మంచి బాట లేక,
త్రాగునీరు లేక, గ్రంథాలయము లేక –
ఒక్క ఊరు కూడ ఉండరాదు !

పాతదైన దెల్ల బంగారమా ? ఏమి ?
క్రొత్తదైన దెల్ల చెత్తగాదు –
మంచి యెచటనున్న ఎంచి గైకొనదగు
ప్రాజ్ఞుడైన యెడల పండితుండు !

పాతికేండ్ల వయసు పడుచు గాడిద కంటె
పరుగునందు, బ్రతుకు పందెమందు,
షష్టిపూర్తి అయిన జవనాశ్వమే మేలు !
ఏన్గు మేలు వంద యేండ్లదైన !

పొందె పూరి గుడిసె పోతన్న భక్తుడై
మేడలందు లేని మేటి తృప్తి
మేడ గుడిసెవోలె మేధావి తిక్కన
మనసులోన తలచి మసలినాడు !!

గొప్ప వారలెవరు చెప్పు మిర్వురిలోన
ఒప్పు గొప్పతనము ఉభయులందు !
గొప్పతనము తోచు కోటి రూపములెత్తి –
మేడనైన, మురికివాడనైన !

పొగడు వారికంటె తెగడువారే హెచ్చు –
చిత్తశుద్ధి సంఘసేవ చేయ !
దొరలవచ్చు కొన్ని పొరపాట్లు పనులలో –
బాధపడడు కార్యసాధకుండు !

పొన్నగంటి యాకు పోవు చూపును తెచ్చు –
అంత కంటె మేలు అవిసె ఆకు
తేనె తీర్చగలదు తిండి లోపములెల్ల –
ముసలితనము బాపు ఉసిరికాయ !

ప్రగతి ప్రజలు చేయు శ్రమ యొక్క ఫలితమే –
స్వర్గవాసు లిచ్చు వరము కాదు !
కరువు కాటకాలు దరి రావు కృషి చెంత !
జయము దిగ్విజయము జయము శ్రమకు !!

ప్రగతిశీలమైన జగదేక మతమేది ?
నిత్యనూత్నమైన నీతి యేది ?
పరుల కుపకరించు కరుణార్ద్ర హృదయమే
పరమ ధర్మతత్త్వ గరిమనాభి !

ప్రజలకేది నేడు బడియైన, గుడియైన,
వేయునట్టి దేది  వెలుగు బాట ?
కట్ట దగును నేడు గ్రంథాలయమ్ములే –
పట్టణమ్ము లందు, పల్లెలందు !

బండరాయినగుచు పడియున్న ననుదీసి
శిల్పిదేవ ! నీవు చెక్కినావు
శిలను నాడు నీదు ఉలిపోటుచే నేడు
రమ్యమైన గొప్ప ప్రతిమనైతి !

బీజ సన్నిభుండు విద్యార్థి శిష్యుండు –
అతని హృదిని దాగి ప్రతిభ యుండు !
తొలకరి సమయమ్ము దొడ్డ దేశికస్వామి ?
బీజ మంకురించి వృక్షమగును !!

భూమిమీద నున్న ప్రేమానుబంధాల
స్వార్థలేశ ముండవచ్చు కొంత !
పరమ పావనమ్ము గురుభక్తి బ్రదుకులో –
గుండె పండినట్టి గొప్ప గుర్తు !

మతము శాస్త్ర విజ్ఞాన గుంఫనములేక
గ్రుడ్డిదగును సమ్యక్ దృష్టి కోలుపోయి !
మహిత విజ్ఞాన శాస్త్రమ్ము మతములేక
కుంటిదగును చైతన్యమ్ము కోలుపోయి !!

కుక్క లరవ వచ్చు – ప్రక్కప్రక్కల చేరి
ఏన్గు రాజవీధి నేగునపుడు !
చుప్పనాతి జనము – గొప్పవారిని చూచి
వెక్కిరింపు విసము కక్క వచ్చు !

బ్రదుకు నందు తరచు గత కాలమును గూర్చి
తలచుకొనిన – ముసలి తనము వచ్చు !
బ్రతుకు నందు తరచు భావి కాలము గూర్చి
తలచు కొనిన – పడుచు తనము మిగులు !

ముసలి తనము రాక ముందె పెద్దరికమ్ము
పడయవచ్చు కవిత వలన ప్రజలు !
బధిర సంఘమునకు బహిరంతరాత్మలై
క్రాంత దర్శులగుట కాంచవచ్చు !

ముసలిదయ్యు భార్య ముసలి భర్తకు పూని
శక్తి ఉడిగి కూడ సలుపు సేవ !
అది పరమ పవిత్ర హావ భావ నిషద్య !
చూడ ముచ్చటయిన శుభ్రశోభ !!

మెదడులోన మార్క్సు – హృదిలోన బుద్ధుడై
విప్లవమ్ము కరుణ వింగడించి
పుట్ట గాక సుకవి భువనైక పౌరుడై
ప్రగతి కొరకు, నూత్న జగతి కొరకు !!

మేలి సుఖము లెల్ల మీసాల తేనెలు !
పదవి పూత పసిడి పంజరమ్ము !
ధనము పెంచుకొన్న పెను త్రాచు పామౌను
జ్ఞాన దీప్తికి భువి సాటి లేదు !

రాత్రి వేయవచ్చు రంగస్థలముపైన
కీర్తికెక్కు చక్రవర్తి పాత్ర –
అరుగవచ్చు బియ్య మరువుతెచ్చుటకునై
పాదచారి యగుచు పట్ట పగలు !

రాలు ఒకనాడు కెందలిరాకు లెల్ల –
వాడిపోక తప్పదు పూల పరిమళములు !
లేతబుగ్గల నిగ్గులు పాతబడును –
ఎల్ల కాలమును వసంత మేల నిల్చు ?

రెండు చెవుల తోడ, రెండు కన్నుల తోడ,
నరుడు పుట్టె ఒక్క నాల్కతోడ
కనుక రెండురెట్లు వినకుండ కనకుండ –
పెదవి కదుపరాదు పెద్దమనిషి !

వచ్చుగాక వేగ వసుధైక రాజ్యమ్ము !
జాతి, మమత, మతము చచ్చుగాక !
శాంతితోడ స్వర్ణ సహకార సంక్రాంతి
వెల్లివిరియుగాక విశ్వమందు !

విత్తనమ్మునౌచు వృక్షమ్ముగా మారి
ఆవరింప దలతు ఆకసమ్ము !
వీలు కాని యెడల వేరు విత్తునకైన
ఎరువునగుట కేను ఇచ్చగింతు !!

విద్య వలన గాక వినయమ్ము వలననే
కోవిదునకు వచ్చు గొప్పతనము !
విద్య అనిన ఎండ వేడి మార్తాండమే !
వినయ మనిన చలువ వెన్నెల సిరి !!

విలువ గట్టరాదు నెలజీతమును బట్టి –
చదువు బట్టి – బ్రదుకు, పదవి బట్టి –
ఐహిక 'తుల' ఎట్లు అంతరాత్మల తూచు ?
ధరణి మీద ఏది 'ధర్మకాట' ?

విషయ సంకలనము విజ్ఞానమా? కాదు –
ఇటుక వాము వేరు ఇల్లు వేరు !
అస్తిపంజరమ్ము అసలు దేహము కాదు –
పత్తి వేరు ! నేత పంచ వేరు !

వెలగ పండ్ల యందు, వివిధ శాస్త్రములందు,
వేరుశనగయందు, వేదమందు –
పడయలేము డొప్ప పగులగొట్టినగాని
గింజ గాని ! లోని గుంజు కాని !!

సన్యసించకుండ సంకల్ప బహుళముల్,
కావి గట్టు వాడు కాడు యోగి !
స్వార్థముడిగి జ్ఞాని సంసారమందుండి
పొందవచ్చు ముక్తి బొందెతోడ !

సరసకవితయన్న, సంగీతకళయన్న,
వ్యంగ్యమన్న, లలితహాస్యమన్న,
అవని విముఖులున్న, అదియె వారికి శిక్ష !
వేరు శిక్ష ఇంక వేయనేల ?

సాధనములుగావు సంతాన సంపదల్,
సత్క్రియాచరణము, జ్ఞానపటిమ –
త్యాగమొకటె అమృతయోగ సిద్ధికి త్రోవ !
సకల ధర్మసార సంగ్రహమ్ము !!

సుదినమేది ? గొప్ప శుభముహూర్తంబేది ?
నవ్వినట్టి క్షణమె నరవరేణ్య !
నవ్వినపుడు చెందు నరుడు జీవన్ముక్తి –
బ్రతుకు క్రుంగదీయు బరువు మరచి !

విశ్వమందు చూడ – వింతయైనది ఏది ?
మనిషి లోన ఉన్న – మానసమ్ము !
వెలుగు కంటె మిగులు వేగమ్ముగా ఏగు ;
సృష్టి కపర సృష్టి చేయగలదు !

ఎన్ని పదవులున్న – ఎన్ని సంపదలున్న –
లేదు సుఖము తృప్తి లేని యెడల !
విద్య – యెంత యున్న – వినయమ్ము లేనిచో –
లేదు చిత్త శాంతి  లేదు సుఖము !

వలపు – యౌవనమున వచ్చు వ్యాధియె సుమ్ము !
వట్టి పిచ్చి ఒంటి బాట యైన –
ఉండ వలెను  ప్రేమ ఉభయ తారకముగా !
అవని లోన – ప్రేమ ద్వివచనమ్ము !!

వాహనమ్ము వలన – వస్త్రధారణ వల్ల –
వినయ వాక్కు వలన – విద్య వలన –
దేహ దీప్తి వలన – స్నేహ శీలము వల్ల –
గౌరవమ్ము  నరులు గాంచవచ్చు !

ఆభరణము లేల ? ఆహార్య మేలరా ?
చిన్మయమ్ము సుమ్ము చిత్త తృప్తి !
చాలు చాలు – నిత్య సంతృప్తి బ్రతుకులో –
అంత కంటె తెలివి అవని గలదె ?

ఏది బ్రదుకు లోన ఎత్తైన శిఖరమ్ము ?
త్యాగ బుద్ధి తోడి దాన నిరతి !
ఘోర పతనమేది ధారుణీ స్థలిలోన ?
పర హితమ్ము మరచు స్వార్థ బుద్ధి !!

కష్ట సుఖములెల కాలానుగుణములే –
మానసికములు గద  మనుజు లందు !
తెలివితేటలున్న  దిట్టయే మనసన్న !
పొందవచ్చు  ముక్తి  బొందె తోడ !!

ఒక్క మనుజు నందె – ఉండవచ్చును కూడి
పరమయోగి – మరియు పాపి కూడ !
యోగి యగును మనిషి ఉత్తేజితుండైన !
పాపి – స్థితి గతులను బట్టి యగును !

కదన రంగములకు – కాల దోషము పట్టె !
పలుక దగును స్వస్తి – కలహములకు !
రాక్షసుండు కోరు, రక్తపాతము, హింస !
సర్వజనుల సుఖమె సాధు కాంక్ష !!

మేటి జగతి యెపుడు మిథ్యయే కావచ్చు –
నాటకమ్ము – బ్రతుకు – బూటకమ్ము !
విశ్వమందు కుక్క విశ్వాసము నిజమ్ము !
తల్లి ప్రేమ తప్ప తథ్య మేది ?

'లేదు దేవు డనెడు వాడెచ్చటను లేదు' !
అనుచు నొక్కి పలికె నాస్తికుండు !
'లేదు – ధరణమీద లేడుగా కంసాలి'
పసిడి ఉంగరమ్ము బదులు పలికె !

చెత్తలోన – పెక్కు చింత పిక్కలు చేరి,
పుచ్చి చచ్చిపోవు పుడమిలోన !
పెరిగి ఒకటి రెండు – పెద్ద వృక్షము లౌను –
బ్రతుకులో అదృష్ట గతులు వేరు !!

కవిత యందు లేని – గాన మాధుర్యమ్ము,
జ్ఞాన మందు లేని – సహృదయమ్ము
విద్యయందు లేని – వినయ విన్యాసమ్ము –
కానుపించు – గుప్త దాన మందు !

క్రొత్తదనము పైకి – గోచరింపగవచ్చు –
పాతదనము లోన లోతు పెరుగు –
మార్పు సులువుగాదు మనుజ లోకమునందు !
నరుక వచ్చు కొమ్మ – పెరుగు వేళ్ళు !!

మారె మానవుండు – మర మేకుగా నేడు,
పెద్ద యంత్ర మయ్యె పృథివి యెల్ల !
ఎంచ మనిషి బ్రదుకు – ఎండ మావుల వెంట,
వెఱ్ఱి పరుగు లెత్తు వేట యయ్యె !

ఆలసింప – తరచు – అమృతమే – విషమౌను !
రేపు కడుపులోన రిత్తదాగు !
నేడు జరుగు పనులు నేడె చేయుట మేలు,
రేపు వరకు ఎప్పు డాపరాదు !

తప్పుచేయవచ్చు – దండింపబడకుండ,
కాని – అంతరాత్మ – కలదు లోన !
గుండెలోన – ముండ్లు – గ్రుచ్చు చుండును గదా,
'అంతరాత్మ' ఘోష అణచు టెట్లు ?

## కవితా కైవల్యము

ఉన్నావందురు ! – నిను కను
గొన్నామందురు నిజముగ కొందరు ఋషులే !
ఉన్నావో ! లేవో ! త్రిజ
గన్నాయక ! – కవిత – నాకు కైవల్యంబే !!

తోమాల నీ కంఠసీమ వేయగలనేల ?
  తారా తరళ రత్న హార మదిగొ !
ప్రమిద దీపాల ఆరాధనలిడ నేల ?
  రవిచంద్ర గోళాల రశ్ములవిగొ !
కుంభాభిషేకమ్ము కోరి చేయగనేల ?
  బ్రహ్మాండముల కాంతి వర్షమదిగొ !
కర్పూర హారతుల్ కైంకర్యమిడనేల ?
  జ్యోతిర్విలాస విద్యుత్తు లవిగొ !

సార్వభౌముడవౌ జగత్ స్రష్ట వీవు !
అవని – భవదీయ దివ్య సింహాసనమ్ము !
ఆకసమ్ము నీ కాణి ముత్యాల గొడుగు !
ఏను నీ కేమి ఉడుగర లీయగలను ?

వేదాంత సారమ్ము వాదింప నగు గాని !
  ఎవరు తేల్చిరి చిట్ట చివరి గుట్టు ?
కడలి లోతులు దూరి గాలింప నగు గాని !
  దొరకినట్టివి కొన్ని గులకరాళ్ళు !
అణు గర్భమును చీల్చి అరయవచ్చును గాని
  మేటి రహస్యముల్ మిగిలియుండు !
రోదసీ గోళాల పాద ముంచుటె గాని
  ఆకాశ మిక కొంత అవలి కరిగె !

ఎంత వెదికిన – నాకు – కన్పింప వీవు !
ఏను నీ తావు చేరుకో లేను ! తండ్రి ;
కాన – దయచేసి – నీవె – నాకడకు రమ్ము !
గుండె తలుపు తెరిచి వేచియుండగలను.

మాటలు వేయ నేల ? – ఇక మానవతా హృదయమ్ముతో – జగ
న్నాటక సూత్రధారి ! – శరణమ్మును వేడగ లేను నిన్ను – ఆ
ర్భాటముచాలు ! – క్రౌంజిలుక పల్కులు పల్కు చుతావులొల్కుపూ
దోట వసింపనిమ్ము – ఒక – తొమ్మిది చిల్లుల తోలు బొమ్మగన్

## జీవిత సూక్తము

ఆశ లెండమావు లటంచు అనినయెడల
భయములున్ రజ్జు సర్ప విభ్రాంతి గావె !
మిథ్య గాదోయి జీవితోన్మేష మెల్ల –
పురుషకారమే యేకైక పరమ పథము !

ముందు రాబోవు శుభదినములను గూర్చి
తియ్యని పగటి కలలు చిత్రించుకొనకు !
జరిగిపోయిన నాటి సంస్మరణ లేల ?
తాల్పు మిప్పుడే నేటి కర్తవ్య దీక్ష !

బ్రదుకొక మాయదారి కల వంటి దటంచు తలంపకోయి కం
దుదలను గ్రమ్ముచున్న తడితో ; తుది లక్ష్యము వల్లకాడు ! మే
నిది ఒక మట్టి బొమ్మ ! కడ కియ్యది మట్టినె జేరునంచు గ
ద్గదికముతో వచింప సరిగా దది ఆత్మకు అన్వయించునా ?

కావున, శోక దైన్యములు గ్రమ్మగ నీయకు ! నేటి కంటె ఈ
జీవనయాత్ర రేపటికి చేరుము ముందుకు ! సంకుల వృథా
జీవిత రమ్య యుద్ధమును చేయుము వీరుడవై జిగీషతో !
పోవకు గొఱ్ఱెపోతు వలె బుఱ్ఱను వంచి గతానుగామివై !

పోరునప్పుడు మరణించు వారికంటె
పారిపోవు నపుడె చచ్చువారు హెచ్చు !
మాయమర్మాల నడివీథి మధ్య నిలిపి
ముక్కు మీద గ్రుద్దుము మేలిముసుగు తొలగ !

ఉత్తమ పూరుషావళి మహోజ్వల జీవచరిత్ర లెల్ల లో
కోత్తర కార్యనిర్వహణ కూర్జితశక్తి నొసంగుచున్ మహో
దాత్త మొనర్చు జీవిత విధానము చూపును ; వచ్చువారి కా
వృత్తులు చెప్ప భూమి కనుపింపగ నిమ్ము భవత్ పదాంకముల్ !

ఈ మహానంత కాలవాహినిని తేలు !
భగ్ననౌకుడు సోదర పథికు డెవడొ,
అడుగు జాడల నొక్క నా డరసినపుడు
పగిలిన హృదిని దిద్దుకోవచ్చు తిరిగి !

## తప్పు నాది కాదు !

'దున్నపోత ! యేల దుక్కి దున్నవు నీవు ?
పంటలింక ఎట్లు పండు చెప్పు ?'
'కాడికట్టలేదు నేడు మీ పాలేరు –
నాదికాదు – తప్పు – నాది కాదు'

'ఏల కట్టలేదు పాలేర ! నాగలి ?
నిక్కి నీడలోన నిలిచినావు !'
'రైతు ఇవ్వలేదు జీతమ్ము నెలనుండి –
నాదికాదు – తప్పు – నాది కాదు'

'రైతుబిడ్డ ! నీవు – జీతబత్తెము లేల
ఇవ్వలేదు ధాన్య మింట దాచి ?'
'సోల దొరకలేదు చాల రోజుల నుండి –
నాదికాదు – తప్పు – నాది కాదు'

‘కట్టె కలప కిపుడు కరువు వచ్చిన దేమి ?
ఏల దొరక వీవు సోల ? సోల ??’
‘చెక్కి వడ్లవాడు చేయుచుండుట లేదు –
నాదికాదు – తప్పు – నాది కాదు’

‘వడ్లవాడ ! గొప్ప వడ్రంగి మేస్త్రిరీ !
చెక్కి సోల నేల చేయ వీవు ?’
‘బండబారిపోయి బాడిస తెగలేదు –
నాదికాదు – తప్పు – నాదికాదు’

‘బండబారినట్టి బాడిసా ! బాడిసా !
ఏల తెగవు చెప్పు మింక నీవు ?’
‘కాల్చలేదు నన్ను కమ్మరి కొలిమిలో –
నాదికాదు – తప్పు – నాది కాదు’

‘కాల్చవేల నీవు కమ్మరి ! కొలిమిలో ?
బాడిసట్లు బండబారిపోవ ?’
‘కొలిమి మండలేదు – కూరుచుంటిని నేను –
నాదికాదు – తప్పు – నాదికాదు’

‘కొలిమి ! కొలిమి ! అంటుకొనని కారణమేమి ?
ఆరిపోవనేల అగ్గి అట్లు ?’
‘తోలుతిత్తి చినిగి గాలి ఊదుట లేదు –
నాదికాదు – తప్పు – నాది కాదు’

‘తిత్తి! తిత్తి! ఏల క్రొత్త తోలును తెచ్చి
కొలిమిలోన గాలి నిలుప వీవు ?’
‘దున్న చావలేదు – తోలెట్లు లభియించు ?
నాది కాదు – తప్పు – నాదికాదు’

# నండూరి వారి రచనలు

| | | |
|---|---|---|
| పద్యకవితలు | : | ప్రగతి గీత, కవితా ప్రభాస, ఆలోచనము, మానస సరసి, ముత్యాల గొడుగు, కవితా సంహిత, తారా తోరణము, కచ్ఛపీ కింకిణీకము |
| వచనాలు | : | తెలుగు దళవాయి, గెంజిగాధ (తెలుగు అనువాదము) ప్రాచీన దక్షిణ భారతదేశ చరిత్ర, గాంధియన్ ఈర, మహాభారత (ఆంగ్ల రచన), బుద్ధ చరిత్ర దమ్మ పదముతో, అమర జీవులు (బుద్ధుడు, క్రీస్తు, గాంధీ), వెలుగు బాట, ప్రాచీన భారత విశ్వవిద్యాలయం |
| నాటకాలు | : | చారిత్రక రూపకములు (ధర్మచక్రం, శ్రీకృష్ణ దేవరాయలు, ఛత్రపతి శివాజీ) శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, విక్రమోర్వశీయము (అనువాదం), అభినవ కురు క్షేత్రము, భువన విజయం, తిమ్మరుసు స్వగతం, శ్రమయేవజయతే దశ రూపకములు (వీరాభిషేకము, త్యాగరాజు, ఉరికంబం, తెగులు గడ్డ, గీత కత్తి, తమ్ముడు, మరణాంతకం, బ్రహ్మనాయుని స్వగతం, జ్యోత్స్నాభిసారిక, గోదావరీ సంగమం). |
| విమర్శలు | : | కవిత్రయము, తెలుగు పద్య శిల్పము, ఆంధ్ర సాంస్కృతిక వికాసము, తిక్కన భారత దర్శనము, పన్నీటి జల్లు, అరణ్యపర్వము (టి.టి.డి. ప్రచురణ) |
| ఇతరాలు | : | కావ్యాలోకనము (లాక్షణిక గ్రంథం), విజడమ్ ఆఫ్ ది వరల్డ్ (సంపాదకత్వం) |



డా॥నండూరి వారికి స్వర్ణ కంకణ బహూకరణం

ఆచార్య తిరుమల, డా॥మాడగుల, డా॥సినారె, డా॥రమణయ్య




29-04-2011 : డా॥తిరుమల శ్రీనివాసాచార్యులకు

- డా॥ నండూరివారి స్మారక పురస్కార ప్రధానం